# పైకంతో కొనలేనిది

"ఇలాగే పిక్చర్‌కి పోదామా అనూ? 'ప్యార్ కా మౌసమ్' చాలా బావుందన్నాడు సురేంద్ర.." కారు డ్రైవ్ చేస్తున్న శ్రీధర్ వాచ్ చూసుకుంటూ అడిగాడు.

రాత్రి పది గంటల సమయం! పొడవైన సిమెంటు రోడ్డు మీద మెత్తగా జారి పోతుంది అంబాసిడర్ కారు. చల్లని కాంతిని చిమ్ముతూ వెలుగుతున్న మెర్క్యురీ దీపాలు రాత్రిని పగలుగా చేసేస్తున్నాయి. వుండి వుండి చల్లగాలి రివ్వున కొడుతోంది.

మఫ్లర్ తీసి చెవుల చుట్టూ కప్పుకుంటూ విసుగ్గా భర్తకేసి చూసింది అనుపమ, "నాకు ఓపిక లేదు బాబూ! రానంటే బలవంతాన లాక్కొచ్చారు ఈ డిన్నరుకు.. అయినా వెధవ సినిమాలంటే విసుగొస్తుందీ మధ్య..."

శ్రీధర్ చిన్నగా నిట్టూర్చి ఊరుకున్నాడు. అప్పుడప్పుడు లోపలికి తొంగి చూస్తున్న దీపకాంతిలో అనుపమ కట్టుకున్న ఆకు పచ్చని జరీ గీతలచీర వింతగా మెరుస్తూంది దానికి పొందేట్టు చెవులకు పచ్చలూ, ముత్యాలూ పొదిగిన కమ్మలు పెట్టుకుని, చేతికి పచ్చల గాజులు వేసుకున్నదామె. చక్కగా చుట్టుకున్న ముడి అందమైన ఆమె ముఖానికి మరింత అందాన్నిస్తూంది. స్తబ్దంగా వెనక్కి వాలి కూర్చున్న భార్యను మాటల్లోకి దింపడానికి ప్రయత్నిస్తూ ఉన్నాడు శ్రీధర్!

"ఇప్పుడెలావున్నావో చెప్పనా అనూ? ఆకుల మధ్య నుండి తొంగిచూస్తే గులాబి బాలలా వున్నావు తెల్సా! నిన్ను చూస్తుంటే కవిత్వం చెప్పాలని వుందిగానీ ప్చ్.. దేవుడు ఆ శక్తి నివ్వలేదు నాకు..."

"బావుందిలేండి వర్ణన! నా మొహానికి పొగడ్త లొక్కటే తక్కువయ్యాయి." చికాగ్గా మొహం చిట్లిస్తూ అంది అనుపమ!

శ్రీధర్ ఇంకేమీ మాట్లాడ్డానికి సాహసించలేదు. శ్రీధర్ బెంగుళూర్లో పేరు పొందిన లాయర్! చిన్న వయసులోనే మంచి పేరు సంపాదించుకుని రెండు చేతులా ఆర్జిస్తున్నాడు, నలుగురిలో మెలగవలసిన మనిషి గనుక పార్టీలనీ, పిక్నిక్‌లనీ ఏర్పాటుచేస్తూ వుంటాడు. తనలాగే భార్యకూడా నలుగురితో కలివిడిగా వుండాలని ఆశిస్తాడు.

మర్నాడు పొద్దున్న తీరికగా ఎనిమిదింటికి నిద్రలేచివచ్చి బ్రష్‌మీద పేస్ట్ వేసుకుంటున్న భార్యతో సరదాగా నవ్వుతూ అన్నాడు శ్రీధర్, "మేమంతా అప్పుడే కాఫీ టిఫిన్ తీసుకోవడం, అవి అరిగి పోవడం కూడా జరిగిపోయింది."

టర్కిష్ టవలుతీసి భుజాన వేసుకుంటూ ఉదాసీనంగా జవాబిచ్చింది అనుపమ, "నాతో ఈ ఇంట్లో వాళ్ళకు ఏ అవసరమూ లేదన్న సంగతి ప్రత్యేకంగా గుర్తుచేయడం దేనికీ?"

శ్రీధర్ మనసు చివుక్కుమన్నది. ఇదే అనుపమ ఒకరోజు వంటావిడ రాకపోతే ఆలస్యంగా కాఫీ యిస్తుంటే తమాషాగా అన్నాడతను "ఆరు గంటల నుండి కాచుక్కూర్చుంటే ఇప్పటికి దయగల్గింది దేవి గారికి" అని.

వెంటనే విసురుగా అనేసింది. "అవున్లెండి... వేళకు మీకన్నీ అమరడం కావాలిగానీ నా నిద్ర చెడితే మీకేం?" అని ఈ సంగతి గుర్తొచ్చి "ఏమిటో అనుపమ వింత స్వభావం గలది!" అనుకున్నాడు శ్రీధర్.

ఆరోజనగా ముహూర్తం కుదిరినట్టు ముందు చెప్పకుండా ఊడిపడ్డారు సురేంద్ర, పార్వతి. వాళ్లని డ్రాయింగ్ రూములో కూర్చోబెట్టి హడావుడిగా లోపలికి వచ్చాడు శ్రీధర్. 'అనూ! సురేంద్ర వాళ్ళొచ్చారు, ఒకసారి వస్తావా?"

అలవాటులేని వంటపనిలో సతమతమవుతున్న అనుపమ కయ్యిమని లేచింది. "వేళాపాళా లేకుండా వచ్చే మీ గెస్ట్‌కి కంపెనీ ఇవ్వడానికి చాకిరీ చేయడానికి నా కోపిక లేదు" అంటూ.

"ప్లీజ్ అనూ! వాళ్ళిప్పుడే వెళ్ళిపోతార్లే! వాళ్ళబ్బాయి పుట్టిన రోజట పార్టీకి పిలవడానికి వచ్చారు! ఒక్కసారి రద్దూ... అలాగే ఆవిడకు తాంబూలం కూడా ఇవ్వాలేమో చూడు..." అనునయంగా చెప్పి వెళ్ళాడు శ్రీధర్.

"ఊరివాళ్ళ విషయాల్లో ఎక్కడలేని శ్రద్ధా వస్తుందీయనగారికి' సణుక్కుంటూ తాంబూలం సిద్ధంగా పెట్టి మొహానికి నవ్వు పులుముకుని బయటకు వచ్చింది అనుపమ.

"తప్పకుండా వస్తారుగా! సరిగ్గా నాలుగున్నర కల్లా వచ్చేయాలి సుమండీ!" అన్న పార్వతి మాటలకు.

'నేను రావాలను కోకపోయినా నాలుగింటికే తయారవమని వేధిస్తారుగా ఈయన' అనుకుంటూ పైకి మాత్రం నవ్వుతూ తలఊపింది వస్తామన్నట్టు.

"అనూ! లేవోయ్ ఇక నిద్రచాలుగాని అప్పుడే నాలుగయింది చూడు... చప్పున

తయారవ్వాలి!" మధ్యాహ్నం భోజనం కాగానే ఏదో పుస్తకం చదువుతూ అలా సోఫాలోనే వెనక్కివాలి, నిద్రపోతున్న భార్యను లేపాడు శ్రీధర్.

పొద్దుటి విషయం పూర్తిగా మర్చిపోయిన అనుపమ కళ్ళు తెరవకుండానే బద్ధకంగా అంది "ఏం అంత తొందర! కాఫీకి వేళ దాటిపోతూందా?"

అందులో వున్న ఎత్తిపొడుపును లెక్కచేయకుండా చిన్నగా నవ్వేసి "మనం సురేంద్రయింట్లో తాగుతాంగా ఎలాగు! ఇప్పుడేం శ్రమపడిచేయొద్దు. పిల్లలు ఎలాగూ పాలేగా త్రాగేది? నువ్వు మాత్రం తొందరగా తయారవ్వు!" అన్నాడు.

"అబ్బబ్బ! ఎప్పుడూ పార్టీలూ... డిన్నర్లూ! హాయిగా యింటి పట్టున వుండనివ్వరు గదా ఒక రోజన్నా!" కోపంగా అంటూ యిష్టం లేకుండానే లేచింది.

'మరి ఆ మధ్య మా అన్నయ్యా వాళ్ళింటికి వెళ్ళినప్పుడు పదిరోజుల్లోనే యింట్లో వుండడం బోరు కొడుతూందని గునిసావే... అందామనుకుని మళ్ళా ఆ రోజు ప్రోగ్రాం చెట్టెక్కుతుందని భయపడి ఊరుకున్నాడు శ్రీధర్.

పదిహేను నిముషాల తర్వాత శ్రీధర్ డ్రస్ చేసుకుని వచ్చేసరికి విసురుగా చీరలన్నీ బీరువాలో కుక్కేస్తూ కనబడింది అనుపమ.

"అదేం అనూ? ఒక్కచీరా నచ్చలేదా? "అయినా ఈ ఆడవాళ్ళకు ఎంత శ్రద్ధబ్బా డ్రస్ విషయంలో..." పరిహాసంగా అన్న భర్త మాటలకు మండిపడింది అనుపమ.

"అవున్లెండి! రెడీగా సూట్స్ వుంటే వేసుకుని నిముషంలో తయారవుతారు. ఒకటుంటే ఒకటి మాచ్‌కాక చస్తున్నా... రెడ్ బార్డరున్న తెల్లచీర కావాలంటే ఒక్కటీ లేదు... యింకెలా?" ఆమె ఆరోజు రవ్వల దుద్దులు పెట్టుకుంది. వేసుకున్న ఎఱ్ఱని పట్టుజాకెట్టుకు మాచ్ అయేలా కెంపుల గాజులు తీసుకుంది.

నవ్వాలో ఏడవాలో తెలియలేదు శ్రీధర్‌కి. "పోనీ మరో చీరకట్టుకోరాదా' అంటే భార్యా మూడ్ ఎలా మారిపోతుందో తెలుసు కాబట్టి మాట్లాడకుండా ఫోన్ దగ్గరికి నడిచాడు, పది నిమిషాల్లో శేట్ ఇంటికి తీసుకు వచ్చిన చీరలలో ఎరుపు బార్డరున్న కాశ్మీరు చీర తీసుకుంది అనుపమ. గబగబా నూట నలభై రూపాయలకు చెక్కు గీసిచ్చి భార్యతో సహా బయట పడి తేలికగా ఊపిరి తీసుకున్నాడు శ్రీధర్.

"మా మాధవి వస్తూందట ఎల్లుండి" మర్నాడు డైనింగ్ టేబులు వద్ద అన్నది అనుపమ!

"ఎవరా మాధవి? ఏమా కథ?" కాస్త హాస్యంగా అడిగాడు శ్రీధర్.

"నా స్నేహితుల గురించి మీ కెక్కడ గుర్తుంటుంది లెండి! అదే మీ వాళ్ళనయితే అడుగులకు మడుగులొత్తి ఊర్లు తిప్పుతారు కార్లో... మన పెళ్ళిలో యింట్రడ్యూస్ చేశాను మీకు నా ప్రాణ స్నేహితురాలని..." వ్యంగ్యంగా అంటున్న అనుపమ వైపు బిత్తరపోయి చూశాడు శ్రీధర్. అంతలో తమాయించుకుంటూ తేలికగా అన్నాడు.

"ఇప్పుడా పురాణం దేనికిలే గానీ... ఇంతకీ ఎప్పుడూ వచ్చేది? ఎల్లుండా? అయితే నేను కోర్టు నుండి వచ్చేసరికి నువ్వు సిద్ధంగా వుంటే స్టేషనుకు వెళ్దాం!"

మాధవి గలగల మాట్లాడుతూ సందడిని తన వెంటే యింటికి తెచ్చేసిందా అన్నట్టు ఇల్లంతా కలయదిరిగి శ్రీధర్‌తోకూడా చనువుగా సరదాగా మాట్లాడేసింది. వచ్చిన రెండోరోజు ఉదయం కాఫీ త్రాగే సమయంలో కెటిల్‌లో కాఫీ తను వంచుకుని అనుపమ కప్పుకూడానింపుతూ అన్నది మాధవి.

"ఇదివరకోసారి వచ్చా ఈ ఊరికి. కాని ఇంత దాకా ప్రక్కనేవున్న, మైసూర్ మాత్రం చూడనేలేదు.

చదువుతున్న పేపరు మడిచేస్తూ 'మనమో ట్రిప్ కొట్టివద్దామేమిటి అనూ? అందులో రాబోయేది దసరాకూడానూ..." ఉత్సాహంగా అన్నాడు శ్రీధర్.

"ఊళ్లు తిరగడమంటే నాకు బోర్ బాబూ.." "చచ్చి సున్నమవుతాం అలసటతో..." అనుపమ మాధవితో అంటుంటే శ్రీధర్ అందుకుని.

"నువ్వు కదలకుండా కారులో కూర్చుందూ! కారే తిప్పుతుంది నిన్ను అన్నిచోట్లకూ.." అన్నాడు ఆ మాటలకు మాధవీ అనుపమ నవ్వేశారు.

బృందావన్ గార్డెన్స్, చాముండేశ్వరి గుడి మొదలైనవన్నీ చూసివచ్చారు. ఆరోజు రాత్రి ట్రెయిన్‌కే మాధవి వెళ్ళిపోయింది.

మర్నాడు ఇంటికి వస్తూనే యధాలాపంగా చెప్పాడు శ్రీధర్ "కారు ట్రబులిచ్చింది అనూ! రిపేరుకిచ్చా" అంటూ.

"అవును మరి! కారుంది కదా అని వచ్చిన వాళ్ళనల్లా ఊళ్ళు తిప్పితే పాడవదూ? నేనేమన్నా అడిగానా మిమ్మల్నినాతో కంప్లెయింట్ చేస్తున్నారు! చేసేదిమీరే అనేది మీరే! అందుకే ఏదీ పట్టించుకోను నేను..." దూకుడుగా అన్నది అనుపమ.

ఓర్పు నశించిపోగా తీవ్ర స్వరంతో అన్నాడు శ్రీధర్.

"అర్థంలేకుండా మాట్లాడకు అనూ! మావాళ్ళకయితే చేస్తానని చెప్పింది నువ్వే... మీ స్నేహితురాలిని మర్యాదకోసం తిప్పితే ఎవడు తిప్పమన్నాడంటూ ఎగిరి పడేదీ నువ్వే! ఇప్పుడు నీకు కంప్లెయింట్ ఇవ్వడం కోసంకాదు నేచెప్పింది, ఇంకా అంతటి సంకుచితపు బుద్ధులు లేవునాకు నీ దయవలన. అయినా నీ తత్వం నాకర్థకావడం లేదు అనూ! నీకేం తక్కువయిందని ఎప్పుడూ అలా చిర చిరలాడుతూ ఇంటిని నరకం చేస్తావు?"

"అనండి! నేను శాటన్‌ని... ఈ ఇంటిని నరకం చేస్తున్నాను! ఇంకా ఏమేమి అనదల్చుకున్నారో అనేయండి! నాకూ విసుగ్గానే వుంది... తప్పదు గనుక బండి లాగుతున్నా.." గద్గద స్వరంతో అంటూ విసురుగా గదిలోకి వెళ్ళి ధడాలున తలుపు వేసుకున్నది అనుపమ.

నిశ్చేష్టుడయి నిలబడిపోయిన శ్రీధర్ కొద్దిసేపటికి తేరుకుని దీర్ఘంగా నిట్టూరుస్తూ సోఫాలో కూలబడ్డాడు.

రెండు రోజులు గడిచాయి. గానీ భర్యాభర్తలిద్దరూ ఎడ మొహం - పెడ మొహంగానే వుండిపోయారు. ఆ రోజు శుక్రవారమని తలకు పోసుకున్న అనుపమ మధ్యాహ్నం తీరిగ్గా అద్దం ముందు కూర్చుని పాపిడి పక్కగా కొద్దిగా తెల్లబడిన వెంట్రుకలకు రంగు పూస్తున్నది.

"ఏం చేస్తున్నావక్కా!" అంటూ చనువుగా లోపలికివచ్చిన పద్మావతి అది చూసి ఉలిక్కిపడింది.

"అరే! అప్పుడే తెల్ల వెంట్రుకలొచ్చాయా నీకు?" కొడుకుని కూర్చోబెట్టి తానూ కూర్చుంటూ ఆశ్చర్యంగా అందామె. పద్మావతి అనుపమకు చిన్నాన్న కూతురు. ఒకటి రెండు నెలల తేడా తప్ప ఇద్దరూ సమవయస్కులే! పద్మావతి అత్తవారింటివారు ఏమంత కలిగిన వాళ్ళు కాదు.

"ఏం చెయ్యమంటావే పద్మా! ఇంకా ముప్ఫై ఏళ్ళన్నా నిండక ముందే ముసలిదాన్నయిపోతున్నా. ఇక తప్పనిసరిగా ఈ 'డై' ఒకటి మొదలు పెట్టాను." నల్లగా ఒత్తుగా నిగనిగలాడుతున్న పద్మ జడకేసి చూసి నిట్టూర్చి అంది అనుపమ.

పిల్లవాడు తల్లి పుస్తెలతో ఆట ప్రారంభించాడు "ఒరే నాన్నా... తెం పేస్తావురా" అంటూ ముద్దుగా వాడి బుగ్గలు పుణుకుతున్న పద్మ వైపు వింతగా చూసింది అనుపమ.

"ఒకటంటించక వూరుకుంటావేం? అలా ఒళ్ళో ఎక్కితొక్కితే ఆ చీర ఎందుకన్నా పనికివస్తుందా?

"పోనిద్దూ, వాడికన్నా చీర ఎక్కువా ఏమిటక్కా? అవునుగానీ పిల్లలేరి? కనబడలేదే.." కట్టుకున్న సాదా వాయిలు చీర కొంగు మెడచుట్టూ వేసుకుంటూ అడిగింది పద్మ.

"వాళ్లను నా దగ్గరకు ఎక్కువగా రానివ్వను. రూమంతా చిందర వందర చేసేస్తారు... ఆయా చూస్తుంది వాళ్ళ విషయాలన్నీ... ఏమిటో నాకంత శ్రద్ధ లేదుస్మీ పిల్లల మీద" నిరుత్సాహంగా అంది అనుపమ.

"అవునూ! ఏమిటలా దిగులుగా కనబడుతున్నావు? ఆ కళ్ళక్రింద నలుపుగీత లేమిటి... ఏమిటి రోజు రోజుకూ అలా తయారవుతున్నావు?" నేలమీద పడి నిద్రపోతున్న కొడుకును ఒళ్ళో పడుకోబెట్టుకుంటూ అడిగింది పద్మ.

"ఏమోలెద్దూ! ఏమిటో బ్రతుకంటేనే రోత కలుగుతోంది" ఎక్కడికన్నా పోయి సన్యాసుల్లో కలుద్దామా అన్నంత విసుగ్గా వుంది.!

అనుపమ మాటలకు విస్తుబోయింది పద్మ!

"నీ కేం తక్కువయిందక్కా! పువ్వుల్లో పెట్టి పూజించే భర్త! అడిగినవ్వీ అమర్చగల తాహతు... అన్నీ వుండి ఏమిటీ ధోరణి?"

"ఏముంటే మాత్రం ఏమిటి పద్మా! మనసుకు శాంతి కరువయ్యాక... అన్నీ వున్నా సుఖంలేదు ప్రాణానికి! సరేగాని నువ్వెలా వేగుతున్నావే ఆ ఇంట్లో! సూర్యకాంతం వంటి మీ అత్తగారూ... ధారాళంగా మసలటానికి వీల్లేని ఆ కొంపా... నీకు విసుగ్గాలేదూ?"

గలగలా నవ్వింది పద్మ ఈ మాటలకు.

"బావుందక్కా! దేవుడిలాంటి ఆయనా దేవుడిచ్చిన వరం మా కన్న బాబూ వుండగా నా కవేం కష్టమనిపించవు. నిజంగా ఆ దేవుడేరమ్మని పిలిచినా వీళ్ళని వదిలి పోనుస్మీ!" కొడుకును గుండెకు హత్తుకుంటూ అన్నది పద్మావతి.

ఏ అలంకారాలు ఆభరణాలు లేకపోయినా కళగా మెరిసే కళ్ళతో సదా చిరునవ్వులు చిందిస్తూ వుండగలిగే పద్మావతికున్న దేమిటో తనకు లేని దేమిటో అర్థం కాలేదు అనుపమకు.

"ప్రగతి" వార పత్రిక

తేది : 5-5-1970

కథా నిలయం
5652
శ్రీకాకుళం